
సాక్షి
బాపట్ల
ఆదివారం । 26 । మే । 2024



సబ్‌జైల్ తనిఖీ

గురజాల: సాధారణ తనిఖీల్లో భాగంగా సబ్‌జైల్‌ను శనివారం సబ్ కోర్టు న్యాయమూర్తి వై శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ముగిసిన పెద్దింటమ్మ వార్షికోత్సవాలు



అమరావతి: అమరావతి గ్రామ దేవత పెద్దింటమ్మ వార్షికోత్సవాలు పూర్ణాహుతితో ముగిశాయి. శనివారం ఉదయాన్నే అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేసి అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు.

న్యూస్‌రీల్

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

తాడేపల్లి రూరల్: మంగళగిరి రూరల్ పరిధిలోని ప్రతి రౌడీషీటర్‌పై నిరంతరం ప్రత్యేక నిఘా ఉంటుందని మంగళగిరి రూరల్ ఎస్‌ఐ క్రాంతి కిరణ్ అన్నారు. శనివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూరల్ పరిధిలోని ప్రతి రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఉంచామని, జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రతి రౌడీషీటర్‌కు కౌన్సెలింగ్ నిర్వహించి, బైండోవర్ చేశామని, కౌంటింగ్ రోజు చట్టవ్యతిరేక చర్యలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన అన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు సమాజంలో సైన్స్ పాత్రపై అవగాహన కల్పించారు. అదేవిధంగా నిత్య జీవితంలో గణితశాస్త్ర ప్రాధాన్యతను విద్యార్థులకు తోటి విద్యార్థులచే చెప్పించారు. కార్యక్రమంలో పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీ పాఠశాల, కళాశాలలో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరు నందివెలుగురోడ్డులోని ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో 5వ తరగతి, జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ శిరీషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ముస్లిం, మైనార్టీ విద్యార్థులకు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా జూనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. గత మార్చిలో జరిగిన టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన కోస్తాంధ్రలోని తొమ్మిది జిల్లాల పరిధిలోని మైనార్టీ విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి ప్రవేశం పొందాలని, వివరాలకు 98495 59611, 87126 25073 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చిరుజల్లులతో కూడిన వర్షం



తెనాలిఅర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం జిల్లావ్యాప్తంగా కనిపించింది. శనివారం తెల్లవారుజాము నుంచి ఈదురు గాలులు వీస్తూ వచ్చాయి. ఉదయం 8గంటల తరువాత ఓ మోస్తరు వర్షం కురిసింది. అక్కడి నుంచి మధ్య మధ్యలో ఆగుతూ చిరుజల్లులతో కూడిన వర్షం పడుతూ వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. జిల్లావ్యాప్తంగా ఉదయం నుంచి ముసురు వాతావరణం కనిపించింది. ఇప్పటివరకు వేసవి తాపంతో అల్లాడిన ప్రజలు కొంత సేదతీరారు.

సాగుకు సమాయత్తం

- శనివారం నుంచి జిల్లాలో వర్షాలు
- ఖరీఫ్ సాగుకు సిద్ధమైన రైతులు
- జిల్లాలో 1,41,916 హెక్టార్లలో వివిధ పంటల సాగు
- అత్యధికంగా 1,03,790 హెక్టార్లలో వరిసాగు
- ఇప్పటికే జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం
- మిగిలిన పంటలకు సబ్సిడీ విత్తనాలు



సాక్షి ప్రతినిధి,బాపట్ల: పది రోజుల కిందట జిల్లాలో అకాల వర్షాలు కురిశాయి. తాజాగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా రూపాంతరం చెందడంతో రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. శనివారం నుంచి జిల్లాలో తేలికపాటి వర్షాలు మొదలయ్యాయి. తుఫాను తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉండడంతో రాబోయే రెండు రోజుల్లో వర్షాలు పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. మరోవైపు తుఫాను ప్రభావంతో నైరుతి రుతుపవనాలు వేగంగా కదులుతున్నట్లు తెలుస్తోంది. రాబోయే రోజుల్లో వర్షాలు కురిసే అవకాశముంది. ఈ ఏడాది ముందస్తు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో జిల్లాలో ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉండనుంది. వర్షాల నేపథ్యంలో అన్నదాతలు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చాలామంది రైతులు భూములను దుక్కులు దున్నారు. మరోమారు వర్షం కురిస్తే మిగిలిన రైతులు పొలాలు దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేయనున్నారు. ఇప్పటికే వాతావరణం కొంత మేర చల్లబడింది. తుఫాను ప్రభావంతో మాగాణి పొలాలు మరింత పదునెక్కనున్నాయి.

ఖరీఫ్ సాగు ఇలా....

జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో 1,41,916 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు కానున్నాయని వ్యవసాయశాఖ అంచనా. ఇందులో 1,03,790 హెక్టార్లలో వరి పంట సాగు కానుంది. తర్వాత అత్యధికంగా పత్తి 4205 హెక్టార్లలో, మినుము 2275, కంది 1960, వేరుశనగ 926, మొక్కజొన్న 803 హెక్టార్లలో సాగు కానుంది. వీటితోపాటు కూరగాయల పంటలు, సజ్జ, రాగి, సామ, ఆరిక పలురకాల పంటలు కలిపి 38,126 హెక్టార్లలో సాగుకానున్నాయి.

కృష్ణాడెల్టా కింద 2,59,475 ఎకరాల్లో వరిసాగు

జిల్లాలో కృష్ణా వెస్ట్రన్ డెల్టా కింద అత్యధికంగా ఖరీఫ్ సీజన్‌లోనే 2,59,475 (1,03,790 హెక్టార్లు) ఎకరాల్లో వరిపంట సాగుకానుంది. ప్రధానంగా వేమూరు, రేపల్లె, బాపట్ల, చీరాల, పర్చూరు ప్రాంతాల్లో ఖరీఫ్‌లో వరి సాగవుతుంది. వేమూరు ప్రాంతంలో జూన్ నుంచే వరి పంట సాగు కానుండగా మిగిలిన చివరి ఆయకట్టు(టెయిలెండ్) ప్రాంతాలైన రేపల్లె, బాపట్ల, చీరాల, పర్చూరు ప్రాంతాల్లో జులై మొదలు ఆగస్టు వరకూ వరిపంట సాగువుతుంది. కృష్ణా నుంచి నీటి విడుదల ఆలస్యమైతే వరిసాగు మరింత ఆలస్యమవుతుంది.

వరిసాగుకు పచ్చిరొట్ట ఎరువులు

ఖరీఫ్ వరిసాగుకు కొంత సమయం ఉండడంతో తాజాగా కురిసిన వర్షాలతో పొలాలు సిద్ధం చేసుకున్న రైతులు సదరు పొలాల్లో పచ్చిరొట్ట ఎరువుల ఏర్పాటు కోసం జీలుగ, పిల్లిపెసర, మినుము పంటలను సాగుచేయడం పరిపాటి. ఇందుకోసం ప్రభుత్వం ప్రతిసంవత్సరం రైతులకు 50 శాతం సబ్సిడీతో పై మూడు రకాల విత్తనాలను అందిస్తోంది. ఇప్పటికే జిల్లాకు వెయ్యి క్వింటాళ్ల జీలుగ, వెయ్యి క్వింటాళ్ల జనుము, 800 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలను కేటాయించింది. అధికారులు వాటిని రైతులకు పంపిణీ చేస్తున్నారు. వర్షాలు అన్ని ప్రాంతాల్లో కురవగానే రైతులు విత్తనాలు సాగుచేస్తారు. 45 రోజుల తర్వాత ఆ పంటలను దుక్కికొట్టి పచ్చిరొట్ట ఎరువుకింద భూమిలో కలిపేస్తారు. ఇది వరిపంట సాగుకు సత్తువ కింద ఉపకరిస్తుంది.

నాణ్యమైన విత్తనాలు అందించేందుకు కృషి

మరోవైపు వరిసాగు సమయానికి ప్రభుత్వం నాణ్యమైన వరి విత్తనాలను రైతులకు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా విత్తన ఉత్పత్తి కేంద్రాల నుంచి ఉత్పత్తి చేసిన విత్తనాన్ని రైతులకు అందించనున్నారు.

రైతులకు సబ్సిడీ విత్తనాలు



ఖరీఫ్ సీజన్‌కు ముందే జిల్లాలో వర్షాలు కురవడం హర్షనీయం. వర్షాల రాకతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. పొలాలను దుక్కులు దున్ని సాగుకు సిద్ధమయ్యారు. వరిసాగు నేపథ్యంలో రైతులందరికీ పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు వ్యవసాయశాఖ సిద్ధంగా ఉంది. ఇప్పటికే 1000 క్వింటాళ్ల జీలుగ, 1000 క్వింటాళ్ల జనుము, 800 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలను 50 శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేస్తున్నాం. అవసరమైన రైతులు రైతుభరోసా కేంద్రాల ద్వారా వీటిని పొందవచ్చు.

– వై.రామకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి

వరితోపాటు ఇతర పంటలసాగు

జిల్లాలో వరిపంటతోపాటు ఖరీఫ్‌లో ఇతర పంటలు సాగు కానున్నాయి. ప్రధానంగా పత్తి, మినుము, వేరుశనగ, కంది, మొక్కజొన్న, పూలు, కూరగాయలు, కొర, సజ్జ తదితర పలురకాల పంటలు 95,315 ఎకరాల విస్తీర్ణంలో సాగు కానున్నాయి. జూన్ నెల నుంచే రేపల్లె, వేమూరు ప్రాంతాల్లోని లంక గ్రామాలతోపాటు బాపట్ల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో వివిధ రకాల పంటలు సాగు కానున్నాయి. తీర ప్రాంతాల పరిధిలోని దాదాపు అన్ని మండలాల్లో వేరుశనగ, కూరగాయలు, వివిధ రకాల పూల సాగు అధికంగా ఉంటుంది. మొత్తంగా ముందస్తు వర్షాల నేపథ్యంలో అన్నదాతలు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు.

ఓట్ల లెక్కింపు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: ఓట్ల లెక్కింపును అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. శనివారం కలెక్టరేట్ నుంచి ర్యాండమైజేషన్ నిర్వహించారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు ఓట్ల లెక్కింపు సిబ్బందిని నియమించారు. రిటర్నింగ్ అధికారుల సమక్షంలో ఆన్‌లైన్ విధానంలో అధికారులను కేటాయించారు. ఓట్ల లెక్కింపునకు నియమించిన అధికారులు జూన్ 4న బాపట్లలోని బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోని స్ట్రాంగ్ రూముల వద్దకు ఉదయాన్నే చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సీహెచ్. శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, ఆర్వోలు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే జిల్లా బహిష్కరణ

గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్టి త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్టి త్రిపాఠి, ఎస్పీ వకుల్‌జిందాల్

చీరాల రూరల్: ఎన్నికల కౌంటింగ్ రోజు అల్లర్లు, గొడవలకు పాల్పడిన నిందితులను గుర్తించి రౌడీషీట్లు తెరవడమే కాకుండా నగర బహిష్కరణ కూడా చేస్తామని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్టి త్రిపాఠి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్‌ను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్టి త్రిపాఠి, ఎస్పీ డాక్టర్ వకుల్ జిందాల్‌తో కలిసి సందర్శించారు. నియోజకవర్గ పరిధిలోని పోలీసు అధికారులతో వారు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఎన్నికల రోజు జరిగిన తదనంతర పరిణామాలు, ఘర్షణలకు నమోదు చేసిన కేసుల వివరాలపై వారు సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తీసుకుంటున్న భద్రతా చర్యల గురించి సమీక్షించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడారు. చీరాల నియోజకవర్గ పరిధిలో ఎన్నికల రోజున జరిగిన అల్లర్లు, గొడవలు, అరెస్టులపై కేసుల్లో జరుగుతున్న దర్యాప్తును పరిశీలించేందుకు ఐజీ త్రిపాఠి చీరాల పోలీసుస్టేషన్‌ను సందర్శించారని చెప్పారు. శాంతి భద్రతల విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా విధులు నిర్వర్తించేలా సిబ్బందికి సూచించినట్లు చెప్పారు. ఎన్నికల కౌంటింగ్ రోజు చీరాల నియోజకవర్గంలో సెక్షన్ 144 సీఆర్పీసీ, పోలీసు 30 యాక్టు అమలులో ఉంటుందని తెలిపారు. ఎక్కడా గుంపులు గుంపులుగా సంచరించరాదన్నారు. రాజకీయ నాయకులు ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయరాదని సూచించారు. అలానే ర్యాలీలు, ఊరేగింపులకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ రోజున ప్రజలు కూడా సంయమనంతో వ్యవహరించి కౌంటింగ్ సజావుగా సాగేందుకు సహకరించాలని, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా అటువంటి వారిపై రౌడీ షీట్లు తెరుస్తామని, పలుమార్లు ఘర్షణలకు పాల్పడిన వారిపై పీడీ చట్టం ప్రయోగించి జిల్లా బహిష్కరణ కూడా చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల రోజు ఘర్షణలకు పాల్పడిన వారిపై కలెక్టర్‌కు నివేదిక కూడా అందజేశామని త్వరలో చర్యలు చేపడతామని చెప్పారు. జిల్లాలో జూన్ 6 వరకు బాణసంచా విక్రయించరాదని నిర్వాహకులకు ఆజ్ఞలు జారీ చేసినట్లు చెప్పారు. పెట్రోలు బంకుల్లో బాటిళ్లలో లూజ్ పెట్రోలు విక్రయించరాదని సూచించామని, నిబంధనలు అతిక్రమించే బంకుల లైసెన్సులు కూడా రద్దు చేస్తామని చెప్పారు. కౌంటింగ్ రోజున ప్రశాంత వాతావరణం ఉండేలా ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ బేతపూడి ప్రసాద్, సీఐలు శేషగిరిరావు, సోమశేఖర్, బి.శ్రీనివాసరావు, ఎస్సైలు పాల్గొన్నారు.

సొంత భవనంలోకి కేంద్రియ విద్యాలయం

- ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం
- ఇర్లపాడు వద్ద తుది దశకు నిర్మాణ పనులు



ఇర్లపాడులో నిర్మాణంలో ఉన్న కేంద్రియ విద్యాలయ భవనం

నాదెండ్ల: చిలకలూరిపేట విద్యారంగంలో మణిహారమైన కేంద్రియ విద్యాలయం 2024 విద్యా సంవత్సరానికి సొంత భవనంలో ప్రారంభానికి సిద్ధమౌతోంది. మండలంలోని ఇర్లపాడులో సుమారు రూ.19.8 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. విద్యాలయం పనులు తుది దశకు చేరాయి. ఈ విద్యాసంవత్సరం నుండే విద్యాలయం ప్రారంభం కానుంది.

2018లో ఈ పాఠశాలకు అనుమతులు రాగా, 2019 నుంచి గణపవరంలోని సీఆర్ పాలిటెక్నిక్ కళాశాల భవనాల్లో తాత్కాలికంగా క్లాసులు నిర్వహిస్తున్నారు. 1వ తరగతి నుంచి ఇంటర్ వరకూ ఇక్కడ తరగతులు నిర్వహించనున్నారు. నాణ్యమైన ఒత్తిడి లేని విద్యకు ఈ పాఠశాల మారుపేరుగా ఉంది. ఈ పాఠశాలలో సీటు రావాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగుల పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది. ఆపై ఖాళీల్లో రిజర్వేషన్ వారీగా కేటాయింపులు చేస్తారు.

9.61 ఎకరాల విస్తీర్ణంలో...

కేంద్రియ విద్యాలయానికి అనుమతులు రావాలంటే కనీసం పదెకరాలు స్థలం ఉండి తీరాలి. అప్పట్లో నాదెండ్ల రెవెన్యూ అధికారులు ఇర్లపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో 10.10 ఎకరాల విస్తీర్ణాన్ని అప్పగించారు. సుమారు 50 సెంట్ల విస్తీర్ణంలో పక్కనే ఉన్న జగనన్న కాలనీకి అవసరమైన రోడ్లకు వదిలారు. ప్రస్తుతం 9.61 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

రూ.19.8 కోట్ల వ్యయంతో...

విద్యాలయంలో తరగతి గదులు, ల్యాబ్, లైబ్రరీ, ఉపాధ్యాయులకు అవసరమైన స్టాఫ్ రూమ్‌లతోపాటూ సిబ్బందికి అవసరమైన క్వార్టర్స్ నిర్మాణాలు జరుగుతున్నాయి. తిరుపతికి చెందిన సీఎస్ఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వారు నిర్మాణ పనులు జరుపుతున్నారు. సీపీడబ్ల్యూడీ విజయవాడ డివిజన్ అధికారులు పనులు పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం గణపవరంలోని సీఆర్ కళాశాలలో విద్యాలయం తాత్కాలికంగా నడుస్తుండగా, 9వ తరగతి వరకూ విద్యాభ్యాసం కొనసాగుతోంది. 2024 విద్యాసంవత్సరంలో పదో తరగతి బ్యాచ్ ప్రారంభం కానుంది. 2025 నుండి ఇంటర్ మొదటి సంవత్సరం, ఆ తర్వాత ఏడాది ఇంటర్ రెండో సంవత్సరం బ్యాచ్ ప్రారంభం కానుంది. వీటికి సంబంధించి కూడా నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

నాణ్యమైన ఒత్తిడి లేని విద్య



నాణ్యమైన ఒత్తిడి లేని విద్యతోపాటూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కేంద్రియ విద్యాలయం పెట్టింది పేరు. విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తాం. ప్రస్తుతం గణపవరంలో తాత్కాలిక భవనాల్లో నడుస్తున్న విద్యాలయంలో 2024 విద్యా సంవత్సరంలో నూతన భవనాల్లో ప్రారంభం కానుంది.

– సునీతసింగ్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

- అత్యంత సమస్యాత్మకంగా పల్నాడు జిల్లా
- జిల్లాలో 150 సమస్యాత్మక గ్రామాల గుర్తింపు
- 1,666 మంది ట్రబుల్ మంగర్స్ పై ప్రత్యేక నిఘా ఏర్పాటు
- జిల్లాలో ఏడు సీఐఎస్‌ఎఫ్ కంపెనీలతోపాటు ఏపీఎస్పీ పోలీసులు
- కౌంటింగ్ కేంద్రాలతోపాటు జిల్లా వ్యాప్తంగా బందోబస్తు
- పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్



సత్తెనపల్లిలో మాట్లాడుతున్న ఎస్పీ మలికా గార్గ్

సత్తెనపల్లి: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి డీఎస్పీ కార్యాలయాన్ని శనివారం ఆమె సందర్శించారు. సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలతో సమీక్ష నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా సబ్ డివిజన్‌లో ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ సాధారణ ఎన్నికల ప్రక్రియ ముగిసేందుకు జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరగాల్సి ఉందన్నారు. జిల్లాలో పలు సంఘటనలు జరిగిన నేపథ్యంలో అత్యంత సమస్యాత్మక జిల్లాగా పల్నాడు ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల రోజున హింసాత్మక ఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇప్పటికే జిల్లాలో 150 సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని చెప్పారు. మొదటి విడతగా 1,666 ట్రబుల్ మంగర్స్‌ను గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే 150 కేసులు నమోదు చేశామని, విచారణ వేగవంతంగా జరుగుతుందన్నారు. మాచర్ల, నరసరావుపేట నియోజకవర్గాల్లో అరెస్టులు ఎక్కువ చేశామన్నారు. గొడవల్లో భాగస్వాములయ్యే వారిపై రౌడీషీట్స్ కూడా ఓపెన్ చేస్తామన్నారు. ఎక్కడైనా పెట్రోల్ దొరికితే పెట్రోలియం యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్, డాక్యుమెంట్ లేని వాహనాలను సీజ్ చేస్తున్నామన్నారు. రౌడీ షీటర్స్, ట్రబుల్ మంగర్స్ గొడవల్లో భాగస్వాములు అయితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాలో ఏడు సీఐఎస్‌ఎఫ్ కంపెనీలు ఉన్నాయని వీటితోపాటు ఏపీఎస్పీ పోలీసుల సేవలను వినియోగించుకోవడం జరుగుతుందన్నారు.

కౌంటింగ్ ప్రశాంతంగా సక్రమంగా జరగాలని, అన్ని రాజకీయపార్టీలు, ప్రజలు దీనికి సహకరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందని, ఏ పార్టీ వారైనా తప్పు చేస్తే వదిలే ప్రసక్తే లేదన్నారు. కౌంటింగ్ వద్ద మాత్రమే కాకుండా జిల్లా మొత్తం బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అల్లర్లు, గొడవలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. రోడ్లపైకి వచ్చి గొడవల్లో పాల్గొంటే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రజల భద్రత కోసమే పోలీసులు ఉన్నారని, పోలీసులకు సహకరించాలన్నారు. పోలీసుల భద్రతే మీ భద్రత అన్నారు. సమావేశంలో సత్తెనపల్లి డీఎస్పీ గుర్‌నాథ్‌బాబు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో చాగంటి కోటేశ్వరరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు శనివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన వారికి ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఈఓ రామరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలతో పాటు శ్రీకనకదుర్గ వైభవం పుస్తకాన్ని అందజేశారు. అనంతరం మల్లేశ్వర స్వామి వారితో పాటు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామిని చాగంటి కోటేశ్వరరావు దంపతులు దర్శించుకున్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి
- కారంచేడు రామానాయుడు వారధి వద్ద ఘటన



ఏడుకొండలు వాహనం



ఘటనా స్థలంలో ఉన్న సాధనరావు వాహనం

చినగంజాం:కారంచేడు మండలం, రామానాయుడు వారధి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. కారంచేడు గ్రామానికి చెందిన మరిపల్లి ఏడుకొండలు (50) ద్విచక్రవాహనంపై చీరాల వైపు వెళుతున్నాడు. అదే సమయంలో హైదరాబాద్‌కు చెందిన బి.సాధనరావు (28) మరో ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఇద్దరూ ఘటనా స్థలి వద్దకు రాగానే ఒక్కసారిగా ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో ఏడుకొండలు అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలతో పక్కన పడిపోయిన సాధనరావును చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఒకే ఘటనలో ఇద్దరు చనిపోవడంతో బంధువులు బోరున విలపిస్తున్నారు. ఏడుకొండలుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నట్లు తెలిసింది. సాధనరావు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కారంచేడు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



సాధనరావు



మరిపల్లి ఏడుకొండలు

క్లుప్తంగా

చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు



కర్లపాలెం: చట్టాన్ని అతిక్రమించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ హెచ్చరించారు. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలంలోని ఏట్రవారిపాలెంలో శనివారం రాత్రి డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ఒక ఎస్సై, వంద మంది పోలీసు సిబ్బంది కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ నెల 13న ఎన్నికలు జరిగిన రోజు గ్రామంలో గొడవలు జరగటంతో మళ్లీ అలాంటి గొడవలు పునరావృతం కాకుండా ఉండేందుకు ముందస్తు చర్యగా కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి వీధిలో తిరిగి అనుమానిత ప్రాంతాలను, వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామస్తులందరూ శాంతియుతంగా ఉండాలని, ఆవేశాలకు లోను కావద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం ఇన్‌చార్జ్ ఎస్ఐ అనిల్‌కుమార్, బాపట్ల రూరల్ సీఐ శ్రీహరి, టౌన్ సీఐ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా చైతన్యమే ప్రజా నాట్యమండలి లక్ష్యం

ఆవిర్భావ సభలో ఇప్టా తెలంగాణ కార్యదర్శి వేముల కొండలరావు



తెనాలి: భారతదేశంలో 1943లో ఆవిర్భవించిన ప్రజాకళా సంస్థ 'ఇప్టా' (ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్) తన సుదీర్ఘ ప్రయాణంలో ప్రజాచైతన్యం కోసం ఎంతగానో కృషి చేసిందని తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్యమండలి కార్యదర్శి వేముల కొండలరావు అన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఇప్టా ఆవిర్భావ సభకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా కార్యదర్శి దేవరపల్లి నీలాంబ్రం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి కొండలరావు మాట్లాడుతూ, దేశభక్తులైన కళాకారులు ఎందరో నాటకం, నృత్యం, జానపద కళా ప్రదర్శనలతో ప్రజాచైతన్యం కలిగించారని చెప్పారు. ప్రజాపోరాటాల వెనుక కళాకారుల పాత్ర ఉందన్నారు. ప్రజల బాధలు, గాధలను ఇతివృత్తంగా తీసుకుని నేటికీ దేశమంతా కళాప్రదర్శనలను ఇస్తున్నారని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ శాఖలు కలిగిన కళాకారుల సంస్థ కేవలం ఇప్టా మాత్రమేనని చెప్పారు. రాబోయే కాలంలో ప్రజల సమస్యలపై మరింత ఉధృతంగా కళారూపాలను తీసుకొస్తూ ప్రజలముందు ప్రదర్శించాలని సూచించారు. అందుకు ప్రజానాట్యమండలి ప్రధాన భూమిక నిర్వహిస్తుందని చెప్పారు. బెల్లంకొండ వెంకట్, పాతూరి సుబ్రహ్మణ్యకవి, బొల్లిముంత కృష్ణ మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజాగేయాలను ఆలపించారు.

మేనరిక వివాహాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సంస్థ కార్యదర్శి లీలావతి

నగరంపాలెం: మేనరిక వివాహాలతో పుట్టే పిల్లలు వైకల్యంతో జన్మిస్తున్నారని వికలాంగుల సంక్షేమం, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ సువార్త అన్నారు. కేంద్ర, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ తప్పిపోయిన బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. సంస్థ జిల్లా కార్యదర్శి టి.లీలావతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏడీ సువార్త మాట్లాడుతూ మేనరికం వివాహాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ట్రాన్స్‌జెండర్స్ తమ గుర్తింపు, ఆధార్, రేషన్ కార్డులు పొందవచ్చని చెప్పారు. ప్రతినెల పెన్షన్ పొందే అవకాశం ఉందన్నారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవీ మాట్లాడుతూ బాల్య వివాహాలపై అవగాహన ఉండాలని అన్నారు. బస్సుల్లో, రైళ్లల్లో చిన్నారులను అపహరించి, వారితో చోరీలు చేయిస్తున్నారని, వాటిని కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ప్రమీల మాట్లాడుతూ తప్పిపోయిన పిల్లలను సాంకేతిక పరిజ్ఞానంతో వెంటనే గుర్తించే అవకాశం ఉందని అన్నారు. జిల్లా రక్షణ అధికారి విజయ్‌కుమార్, జిల్లా యాంటీ ట్రాఫికింగ్ యూనిట్ అధికారిణి బేబీరాణిలు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల పట్ల బాధ్యతగా ఉండాలని అన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. వివిధ నేరాల్లో బాధితులకు ప్రభుత్వం అందించే సహాయం, బాల నేరస్తుల చట్టం, సీనియర్ సిటిజెన్/బాల కార్మికుల హక్కులు, బాల్య వివాహాలు, బాలల హక్కులపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి వివరించారు. సదస్సులో క్రాఫ్ట్ జిల్లా సమన్వయకర్త సమీర్, కలెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్ లక్ష్మయ్య, ప్రభుత్వ అధికారులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్స్ పాల్గొన్నారు.

నకిలీ మిర్చి విత్తనాలు స్వాధీనం

రూ.2.61 లక్షల విలువైన విత్తనాలు పట్టుకున్న విజిలెన్స్ సిబ్బంది



సీజ్ చేసిన విత్తనాలతో ఎస్పీ ఈశ్వరరావు

నగరంపాలెం: నకిలీ మిర్చి విత్తనాలను విక్రయించే ఓ వ్యక్తిని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. రూ.2.61 లక్షలు విలువ చేసే నకిలీ విత్తనాలు సీజ్ చేసి, అతనిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు ఏటుకూరు రోడ్‌లోని సింధూరి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో శనివారం గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు సిబ్బందితో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నకిలీ మిర్చి విత్తనాలు విక్రయిస్తున్నారనే సమాచారంతో తనిఖీ చేయగా, 8.70 కిలోల కల్తీ/నకిలీ మిర్చి విత్తనాలు ప్యాకింగ్‌కు సిద్ధం చేసినట్లు గుర్తించారు. బెంగళూరు నుంచి కిలో రూ.20 వేలు చొప్పున కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. వాటిని ఆకర్షణీయమైన ప్యాకెట్లల్లో ప్యాకింగ్ చేసి, కిలో రూ.80 వేల నుంచి లక్ష వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు గుర్తించారు. విత్తనాలను విడిగా కొనుగోలు చేసి, ప్యాకింగ్ చేసి విక్రయించడం విత్తన చట్ట ప్రకారం నేరమని, ఈ క్రమంలో రూ.2.61 లక్షలు ఖరీదు చేసే 8.70 కిలోల మిర్చి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాలపై నిందితుడిపై 6ఏ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏఓ రమణకుమార్, ఎస్ఐ ఎం.రామచంద్రయ్య, స్థానిక వ్యవసాయ అధికారి బి.అంజిరెడ్డి అధికార సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుదల, ఏకాగ్రతతో ఐఏఎస్ సాధ్యమే

పొగాకుబోర్డు ఈడీ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న అద్దంకి శ్రీధర్‌బాబు, పక్కన ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: సివిల్స్ సాధనకు పట్టుదల, ఏకాగ్రతతో కూడిన సన్నద్ధత అవసరమని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కేవీఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ సంయుక్త ఆధ్వర్యంలో టెన్త్ ఆపైన చదువుతున్న విద్యార్థులకు సివిల్స్ సన్నద్ధతపై బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఉచిత అవగాహన తరగతుల్లో అద్దంకి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఐఏఎస్ సాధించాలంటే ఉన్నత వర్గాలు, ఆర్థికంగా స్థితిమంతులే కానవసరం లేదని, ఏ భాషలోనైనా కనీస డిగ్రీ విద్యార్హతగా సరైన శిక్షణతో ఐఏఎస్ సాధించవచ్చన్నారు. ప్రతి ఏటా యూపీఎస్సీ ద్వారా 10 లక్షల మంది దేశవ్యాప్తంగా పరీక్షలు రాస్తే అనేక వడపోతల ద్వారా కేవలం 60 మంది ఐఏఎస్‌కు ఎంపికవుతున్నారని తెలిపారు. సివిల్స్‌లో ఐఏఎస్‌తోపాటు ఐపీఎస్, ఐఆర్ఎస్ వంటి సర్వీసులు సైతం ఉన్నాయని వివరించారు. కేవీఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కరెంట్ అఫైర్స్‌పై పూర్తిస్థాయి ఆధిపత్యం కనబరిచే వారికి ఐఏఎస్ సాధించటం ఎంతో సులభతరమన్నారు. ఆంగ్ల భాషపై పట్టు, భావవ్యక్తీకరణ, దినపత్రికలు, వ్యక్తిత్వ వికాసాన్ని పెంచే పుస్తకాలు చదవటంతో పాటు అంతర్జాతీయంగా, జాతీయంగా రోజువారీ జరిగే సంఘటనలపై అవగాహన కలిగి ఉండటం ఐఏఎస్ పరీక్షలకు ప్రధాన అర్హతగా ఉంటాయని వివరించారు. 'సన్' కో-ఆర్డినేటర్స్ ఆశిష్, హరీష్, సంధ్య, బ్లెస్సీ తదితరులు పాల్గొన్నారు.

కారెంపూడి అల్లర్ల కేసుల్లో 25 మంది అరెస్టు

కారెంపూడి: సార్వత్రిక ఎన్నికల అనంతరం కారెంపూడిలో గత 14వ తేదీ చెలరేగిన అల్లర్లు ఆస్తుల విధ్వంసాల కేసులకు సంబంధించి ఇప్పటి వరకు 25 మందిని అరెస్టు చేశామని కారెంపూడి ఎస్ఐ కె అమీర్ శనివారం తెలిపారు. మూకుమ్మడిగా కారెంపూడిలో పలు షాపులు, ఇళ్లపై దాడులకు పాల్పడడం, పార్క్ చేసిన వాహనాలను నిప్పంటించి దహనం చేయడం ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం లాంటి దుశ్చర్యలకు పాల్పడిన రెండు ఘటనలకు సంబంధించి రెండు కేసులు రిజిస్టర్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆ కేసుల్లో నిందితులను గుర్తించి అరెస్టులు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రెండు కేసుల్లో 25 మంది నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచడం జరిగిందని ఎస్ఐ అమీర్ వెల్లడించారు. అలాగే మండలంలోని ఒప్పిచర్ల గ్రామ ప్రాథమిక పాఠశాలలోని ఒక పోలింగ్ బూత్‌లో 13వ తేదీ పోలింగ్ నాడు ఈవీఎం పగులగొట్టిన కేసులో గ్రామానికి చెందిన ఒకరిని అరెస్టు చేయడం జరిగిందని ఎస్ఐ అమీర్ పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళకు గాయాలు

నాదెండ్ల: రహదారిని దాటుతున్న మహిళను ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రి పాలైన సంఘటన శుక్రవారం రాత్రి సాతులూరులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జెట్టిపాటి శివమ్మ పన్నెండేళ్ళ క్రితం తన పక్కింటి మహిళకు రూ.10 వేలు అప్పుగా ఇచ్చింది. డబ్బులు తిరిగి ఇవ్వమని ఎన్నిసార్లు అడిగినా ఫలితం లేకపోవటంతో పెద్దలను ఆశ్రయించింది. గ్రామ పెద్దలైన గద్దె కోటేశ్వరరావు, రావుల శ్రీనివాసరావు, పాటిబండ్ల శేఖర్ వద్దకు వెళ్లి విషయం తెలిపి సహాయం కోరింది. అప్పు తీసుకున్న వారితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో తిరిగి తన ఇంటికి బయలు దేరింది. ఈ క్రమంలో గుంటూ రు నుంచి ఇసప్పాలెంకు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో తీవ్రగాయాలపాలైన శివమ్మను స్థానికులు 108 సాయంతో చిలకలూరిపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరులో మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి భర్త జెట్టిపాటి అంకారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జె బలరామ్‌రెడ్డి తెలిపారు.

పెదకాకానిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం

ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు



పెదకాకాని: పెదకాకాని గ్రామ శివార్లలో శనివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. పెదకాకాని రాజరాజేశ్వరి ఆసుపత్రి వెనుకభాగంలో ఉన్న నిర్మానుష్య ప్రాంతంలో వేపచెట్టు కింద మహిళ మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు సుమారు 25 సంవత్సరాల వయస్సు ఉన్న వివాహిత ముస్లిం మహిళగా గుర్తించారు. ముస్లిం మహిళలు సాంప్రదాయంగా ధరించే బుర్కాను మృతురాలు ధరించి ఉంది. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతరాలి నోటి వెంట నురగ వచ్చిన ఆనవాళ్లు ఉన్నాయి. నురగతో పాటు రక్తం కూడా రావడం చూస్తుంటే ఎవరైనా ఆ ప్రాంతానికి తీసుకు వచ్చి కొట్టి బలవంతంగా విషం తాగించి ఉంటారా, లేక ఆ మహిళే విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడిందా.. అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలానికి క్లూస్ టీం నిపుణులు చేరుకుని వేలిముద్రలు సేకరించారు. వాస్తవానికి శుక్రవారం సాయంత్రం నుంచే పొలాల్లో మహిళ మృతదేహం ఉందని పశువులు మేపుకొనే వారి ద్వారా సమాచారం అందినప్పటికీ ఆ ప్రాంతాన్ని పోలీసులు గుర్తించలేదు. స్థానిక వీఆర్ఓ నరసింహారావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు. మృతదేహాన్ని గుంటూరు మార్చురీకి తరలించారు.

గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



మతుకుమల్లిలో స్వాధీనం చేసుకున్న బైకులతో పోలీసులు

శావల్యాపురం: సార్వత్రిక ఎన్నికల అనంతరం గ్రామాల్లో గొడవులు అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకరరావు హెచ్చరించారు. శనివారం మండలంలోని మతుకుమల్లి గ్రామంలో ప్రతి ఇంటిని జల్లెడ పట్టడంతో పాటు గ్రామంలో మరణాదాయులు,నాటు బాంబులు ఉన్నాయేమా అని ముందస్తు సోదాలు పోలీసులు చేశారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ సుధాకరరావు మాట్లాడుతూ ఎన్నికల అనంతరం గ్రామాల్లో శాంతి భద్రతలు విఘాతం కలుగకుండా ఉండటానికి ఈ సోదాలు చేస్తున్నట్లు తెలిపారు. యువత ఇటువంటి రాజకీయ అల్లర్ల, గొడవులకు దూరంగా ఉండాలన్నారు. ఓటు వినియోగించుకోవటం ప్రతి పౌరుడు ప్రాథమిక హక్కు అయితే రాజకీయ గొడవులు, అల్లర్లకు దూరంగా ఉండటం నైతిక హక్కుగా ప్రతి ఒక్కరు భావించాలన్నారు. అనంతరం గ్రామంలో సరైనా పత్రాలు లేని బైకులు స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషనుకు తరలించారు. ఎస్సైలు చల్లా సురేష్, లక్ష్మీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

గుండ్లపాడులో..

వెల్దుర్తి: గుండ్లపాడులో గ్రామంలో శనివారం మాచర్ల రూరల్ సీఐ సురేష్, ఎస్ఐ వెంకట్రావుల ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ పోలీసు సిబ్బందితో గ్రామంలో పోలీసు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ మాట్లాడుతూ సమస్యాత్మక గుండ్ల పాడు గ్రామంలో కార్డన్ సెర్చ్ లో భాగంగా ఇళ్లలో తనిఖీలు నిర్వహించామన్నారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, వాహన యజమానులు సరైన ధృవీకరణ పత్రాలు చూపించి వాహనాలను తీసుకెళ్లాలన్నారు. ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. ఏఎస్పీ హనుమంతు, డీఎస్పీ శివరాజ్, సీఐలు సుబ్బారావు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

పిడుగురాళ్ల: ఎన్నికల కౌటింగ్ సమయంలో ఎవరైనా గొడవలకు పాల్పడితే అటువంటివారిపై శాఖ పరమైన చర్యలు తప్పవని పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీఖాన్ శనివారం తెలిపారు. మండలంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరిగిన అల్లర్లకు పాల్పడిన సుమారు 40 మందిని అరెస్టు చేసి వారిని రాజమండ్రి, నెల్లూరు సెంట్రల్ జైలుకు పంపించటం జరిగిందన్నారు. జూన్ 4వ తేదీన ఎన్నికల కౌటింగ్ జరుగుతుందని, కౌటింగ్ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు కానీ, కార్యకర్తలు కానీ, యువకులు కానీ ఎవరైనా గొడవలకు, అల్లర్లకు పాల్పడితే అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. అవసరమైతే అల్లర్లకు పాల్పడిన వారిపై రౌడీ షీట్లు కూడా ఓపెన్ చేయటం జరుగుతుందని హెచ్చరించారు.

ఎస్సీ అట్రాసిటీ కేసును విచారించిన డీఎస్పీ



విచారణ చేస్తున్న డీఎస్పీ సుధాకరరావు

ఈపూరు: ఎస్సీ అట్రాసిటీ కేసును విచారించేందుకు శనివారం మండలంలోని కొండ్రముట్ల ఎస్సీ కాలనీని డీఎస్పీ సుధాకర్ సందర్శించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎస్సీ కాలనీకి చెందిన మక్కెన శౌరిని గ్రామానికి చెందిన కొందరు కులం పేరుతో దూషించి దాడికి దిగారని, దీంతో ఆయన కులం పేరుతో దూషించినందుకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఫిర్యాదు మేరకు నరసరావుపేట డీఎస్పీ సుధాకర్ కాలనీని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయన వెంట రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ మహమ్మద్ ఫిరోజ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

వేల్పూరులో

శావల్యాపురం: మండల పరిధిలోని వేల్పూరులో ఎన్నికల నేపథ్యంలో ఎస్సీ వర్గీయులపై దాడికి పాల్పడిన సంఘటనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు ఘటనపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రంలో జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున సభలు సమావేశాలు నిర్వహించరాదన్నారు. అనంతరం ఎస్సీ కేసులో జరిగిన సమగ్ర వివరాలను పోలింగ్ కేంద్రం ఆవరణలో సంఘటన సమయంలో ఉన్ననటు వంటి వారి ద్వారా వివరాలు అడిగి తెలుసుకొని నమోదు చేసుకున్నారు. ఆయనతో పాటు వినుకొండ రూరల్ సీఐ ఉప్పటూరి సుధాకరరావు, ఎస్సై చల్లా సురేష్, సిబ్బంది ఉన్నారు.

వేర్వేరు గ్రామాల్లో డీఎస్పీ విచారణ

బొల్లాపల్లి: ఎన్నికల అనంతరం జరిగిన దాడుల పై నమోదైన కేసులపై నర్సరావుపేట డీఎస్పీ ఎం సుదాకరరావు శనివారం సాయంత్రం విచారణ చేపట్టారు. గుట్లపల్లి, బొల్లాపల్లి ఎస్సీ కాలనీలను సందర్శించి బాధితులను, గ్రామస్తులను విచారించారు. దాడికి గురైన బాధితుల నుంచి వివరాలు సేకరించారు.

నేటి నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులో వేంచేసి యున్న మహంకాళి అమ్మవారి 47వ ప్రతిష్ఠ వార్షికోత్సవాలను ఈనెల 26నుంచి 30వ తేదీ గురువారం వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డీసీహెచ్ వెంకటరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి ఆదివారం ఉదయం లక్ష్మీదేవి అలంకరణ, సోమ వారం సరస్వతీదేవి అలంకరణ, మంగళ వారం రాజరాజేశ్వరిదేవి అలంకరణ, బుధవారం ధన లక్ష్మీ దేవి అలంకరణ, గురువారం గాయత్రీ దేవి అలంకరణలు నిర్వహిస్తామని, 30వ తేదీ సాయంత్రం అమ్మవారి విశేష అలంకారంతో గ్రామోత్సవం నిర్వహించనున్నామన్నారు.